# డాక్టర్ శూన్యారావ్



**-నంద గోపాల్**

శూన్యారావ్ తనకు ఈ పేరు పెట్టిన తల్లిదండ్రులను ఎన్నటికీ క్షమించలేడు. తన తండ్రి అమాయకత్వాన్ని హేళన చేయడం కోసం మేనమామ తనకు ఈ పేరు పెట్టమని సలహా ఇచ్చాడనీ, కాబట్టే తనకు ఆ పేరు పెట్టడం జరిగిందని తెలిసిన తరువాత ఇంతవరకూ మేనమామతో మాట్లాడలేదు.

మేనమామ తన కొడుక్కు తుషార్ అనీ, కూతురికి మానస అనీ మంచి పేర్లు పెట్టుకొని తనకు మాత్రం అవహేళనకు గురిచేసే విధంగా శూన్యారావ్ అనే పేరు పెట్టమని సలహా ఇవ్వడం తనను మరింత కోపానికి గురిచేసింది.

నీ పేరును సార్థకం చేసేలా నీకు సున్నా మార్కులు రావాల్సి ఉంది. కొంచెం ఎక్కువే వచ్చాయే అని తనను అవమానపర్చిన టీచరు మాటలు ఎప్పటికీ మర్చిపోలేక పోయాడు. అప్పటి నుంచి పట్టుదలతో చదివి అన్ని క్లాసుల లోను మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక దానిని సాధిస్తూ వచ్చాడు. మేథ్స్‌లో ఎవరికి ఏ సందేహం వచ్చినా తనే తీర్చేవాడు.

అయినా తన పేరు గురించి అందరూ తన వెనుక నవ్వుకుంటారని తెలిసి శూన్యారావ్ అను క్షణం బాధపడతాడు.

క్లాసులోని అమ్మాయిలకు తన పేరు ఒక జోక్‌లా ఉంటుందనీ, తన గురించి ప్రస్తావన రాగానే అందరూ నవ్విన తర్వాతే మాట్లాడతారనీ రూఢీగా తెలిసింది.

ఆ నవ్విన వాళ్లలో తను ఆరాధించే సుజాత కూడా ఉందని తెలిసిన రోజు రాత్రంతా బాధప డ్డాడు.

ఎలాగైనా తన పేరు తనకు గౌరవం తేవాలని నిర్ణయించుకున్నాకే నిద్రపోయాడు. దాని కోసం ఏం చేయడానికైనా సిద్ధపడ్డాడు కాని ఏం చేస్తే తన పేరుకు గౌరవం వస్తుందో అర్థం కాలేదు.

ఎం.ఎస్.సి. మేథ్స్ తర్వాత యూనివర్సిటీలో డాక్టరేటు కోసం ప్రవేశం పొందాడు. డాక్టర్ శూన్యా రావ్ అనే పేరు కొంత గౌరవాన్ని ఇస్తుందని, డాక్ట రేట్ కోసం తీవ్రంగా కృషి చేసి డాక్టరేట్ సాధిం చాడు.

లోకం తనని డాక్టర్ శూన్యారావ్‌గా గుర్తించినా పూర్తి సంతోషం రాలేదు. డాక్టర్ శూన్యారావ్ అని తనను పరిచయం చేస్తున్నప్పుడు ఆ పరిచ యంలో కొంచెం వ్యంగ్యం ధ్వనిస్తుందేమోననే ఆలోచన తనను తీవ్రంగా కలిచివేసింది.

'వేద' అనే పదానికి జర్మనీలో పేటెంట్ లభిం చడం గురించి ఇండియన్స్ ఆందోళన వ్యక్తం చేయడం గురించి పేపర్లో చదువుతూ, పేరుకు నిజంగా ఇంత విలువ ఉందా అంటూ ఆలోచనలో మునిగిపోయాడు.

ఇండియన్స్‌కి సంబంధించిన వాటినన్నిటినీ అందరూ పేటెంట్ తీసుకుంటున్నారని బాధప డటం కంటే ఇండియన్సే అన్నింటినీ ముందే రిజి ష్టరు చేసుకోవచ్చు కదా అనే ఆలోచన వచ్చింది.

తన సబ్జెక్టయిన మేథ్స్‌ను గురించి ఆలోచిస్తూ జీరోని (శూన్యం) ప్రపంచానికి అందించింది భార తీయులే అన్న విషయం స్ఫురణకు రాగానే ఆనం దంతో మనిషి మొత్తం మైకం కమ్మినట్లు అయిపో యాడు.

ఏ పేరైతే తనను ఇంతకాలం బాధించిందో ఆ పేరే తనకు గొప్ప పేరు తెచ్చే అవకాశం ఉందని అర్థం చేసుకున్నాడు.

మరుసటి రోజే జీరో కనిపెట్టింది తన పూర్వీ కులు అనీ, అందుకే తనకు శూన్యారావ్ అని పేరు పెట్టారని, తను మేథ్స్‌లో ఎం.ఎస్.సి. చేయడానికీ, డాక్టరేటు పొందడానికీ అదే కారణమనీ కాబట్టి జీరోకు పేటెంట్ హక్కులు తనకు ఇవ్వాలని అప్లికే షను పెట్టాడు.

అప్లికేషను పరిశీలించిన తరువాత 'జీరో'కి పేటెంట్ కోసం ప్రపంచంలో వేరెవరూ అప్లై చేయ లేదని నిర్ధారించుకున్న తర్వాత డాక్టర్ శూన్యారావ్ పేరుతో 'జీరో' పేటెంట్ చేయబడింది. కానీ ఈ పేటెంట్ ప్రపంచాన్ని కుదిపి వేస్తుందని దానిని రిజి ష్టరు చేసిన ఆఫీసరు ఊహించలేదు.

జీరో ఎన్ని రకాలుగా ఉపయోగపడుతుందో పరిశీలించిన తరువాత, విద్య కోసం, సైన్సు కోసం జీరో ఉపయోగాన్ని వదిలివేసి, వ్యాపార పరంగా జీరోని ఉపయోగించుకుంటున్న అన్ని సంస్థల నుంచీ తన పేటెంట్‌పై రాయల్టీగా కొంత ధనాన్ని సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. మొద టగా అమెరికాలోని మల్టీ నేషనల్ కంపెనీలకు, బ్యాంకులకు ప్రతి కోటి రూపాయల లావాదేవీ లకు వంద రూపాయలు రాయల్టీగా చెల్లించాలని నోటీసులు పంపించాడు.

నోటీసుతో పాటు పేటెంట్ కాపీని జతచేసినా ఏ కంపెనీ కూడా స్పందించలేదు. అమెరికాలోని తన మిత్రుని ద్వారా ఒక ప్రముఖ లాయరుతో సంప్ర దించిన తరువాత, ఆదాయంలో పది శాతాన్ని ఫీజుగా నిర్ణయించి, బ్యాంకులు, కార్పొరేషన్లు రాయల్టీ చెల్లించకపోతే నెల రోజుల లోపు 'జీరో'ని ఉపయోగించడం మానాలని లేకపోతే వ్యాపార కార్యకలాపాలను ఆపాలని లాయరు నోటీసులు పంపించాడు.

ఇవి ప్రముఖ 'లా' సంస్థ నుండి వచ్చిన లాయరు నోటీసులు కాబట్టి ఈ నోటీసులు అమె రికా అంతటా సంచలనాన్ని సృష్టించాయి. టీవీ లలో, పత్రికలలో ఈ కేసు గురించి ప్రముఖ లాయర్ల అభిప్రాయాలతో వాదోపవాదాలు జరి గాయి.

చివరకు 'జీరో' బదులు వేరొక పద్ధతి కనిపెట్టే దాకా డాక్టర్ శూన్యారావ్‌కి రాయల్టీ కట్టక తప్పదని తేల్చాయి.

పేటెంట్ ద్వారా కోట్లకొద్దీ గడించిన కొన్ని వైద్య సంస్థలు సైతం ఈ పేటెంట్‌కి రాయల్టీ చెల్లించడా నికి విముఖత చూపించి చివరకు తప్పనిసరి పరి స్థితులలో మాత్రమే డబ్బు చెల్లించాయి.

అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, జర్మనీ, జపాన్, ఇంగ్లాండ్ మొదలైన దేశాల ప్రముఖ సంస్థల నుంచి రాయల్టీని సంపాదిస్తే డాక్టర్ శూన్యారావ్ భారతదేశంలోని అత్యంత ధనవంతు డిగా మారతాడని ప్రపంచం గుర్తించింది.

ఒక సంవత్సరంలోనే డాక్టర్ శూన్యారావ్ భారత దేశంలోని అత్యంత ధనవంతుడిగా మారడం, వచ్చే డబ్బు కూడా విదేశీ కరెన్సీ రూపంలో రావడం వలన భారతదేశ ప్రభుత్వం దగ్గర ఉన్న విదేశీ కరెన్సీ రిజర్వుల కంటే డాక్టర్ శూన్యారావ్

దగ్గిరే ఎక్కువ విదేశీ కరెన్సీ ఉండడం జరిగింది. డాక్టర్ శూన్యారావ్ పేరు అనూహ్యంగా దేశమంతటా మార్మోగిపోవడం, భారతదేశంలోని ప్రముఖ వ్యక్తిగా మారిపోవడంతో మొదటిసారిగా శూన్యారావ్ తన పేరుని చూసుకొని గర్వించాడు.

ఎలక్ట్రిసిటీ ప్రసారాన్ని కనిపెట్టిన 'యాంపియర్'కు వారసుడిగా ప్రకటించుకున్న ఒక వ్యక్తి ఎలక్ట్రిసిటీ ప్రసారాన్ని పేటెంట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని తెలిసి ప్రపంచం నివ్వెరపోయింది.

ఈ పేటెంట్ విధానం ప్రపంచ మేధావులనూ, ప్రభుత్వాలను కుదిపివేసింది.

ప్రపంచ మేధావులంతా ఈ పేటెంట్ విధానం ద్వారా మానవాళికి కలగబోయే ముప్పు గురించి కూలంకుషంగా పరిశీలిస్తున్నారు.

ఉదాహరణకు టెలివిజన్‌లో ఉపయోగించే వస్తువులైన పిక్చర్ ట్యూబు, ట్రాన్సిస్టర్, ఐ.సి.చిప్, కెపాసిటర్, రెసిస్టర్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్, స్పీకర్, పొటన్షియోమీటరు వంటి అన్ని పార్టులకు విడివిడిగా పేటెంట్ ఉండి రాయల్టీ చెల్లించాల్సి ఉంటే ఇప్పుడు పదిహేను వేలకు లభించే టెలివిజన్ పది లక్షల రూపాయలు అయ్యే అవకాశం ఉంది.

లక్షల మంది శాస్త్రవేత్తలు అహర్నిశలూ శ్రమించి లాభార్జన లేకుండా పరిశోధనే లక్ష్యంగా పెట్టుకొని మానవాళికి అందించిన ఈ విజ్ఞానాన్నంతటినీ ఉపయోగించుకొని కనిపెట్టే చిన్నచిన్న విషయాలను వ్యాపారంగా మార్చి పేటెంట్ చేసే విధానాన్ని ప్రజలంతా వ్యతిరేకించే రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం.

ప్రపంచ మేధావులంతా కలసి వ్యాపార పేటెంట్లకు వ్యతిరేకంగా ఏర్పడిన ఫోరానికి అప్పుడే అనేక ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి.

★

